

# మర్రినీడ

'ఎల్లోరా'

ఆ ఊళ్లో ఉద్యోగంలో ప్రవేశించిన సూర్యం—కొత్తగా బదిలీ అయి ఈ మధ్యనే వచ్చాడు!

ఊరూ కొత్త, ఉద్యోగమూ కొత్త-అవడంతో అతనికి క్షణం ఓ యుగంలా గడుస్తూంది!

బ్రహ్మచారి అవడంతో పలకరించే వారూలేరు- ప్రశ్నించేవారూలేరు- అదే అనుకొన్నాడు ఉద్యోగంలో ప్రవేశించిన మొదటి రోజు. "చక్కని చుక్కని చూసి పెళ్లి చేసుకోక ఇలా ఎంతకాలం రా - సూరీ" అని నానమ్మ అంటూంటే విసుక్కొన్న రోజులు ఇప్పుడు జ్ఞాపకం వచ్చి కళ్లంట నీళ్లు తిరిగినంత పని అవుతూంది.

ఆఫీసు నాలుగు గంటలకే వదిలేస్తారు. అద్దె గదిలో ఒంటరిగా ఉండడం ఎంతో జైల్లో ఉండడమూ అంతే అని ఆ సమయంలో అనుకొని తన బ్రతుకుని తనే తిట్టుకొనేవాడు.

చెరువు గట్టున రంగు ఓణీలూ చీరలూ అలంకరించుకొని పడుచు

పిల్లలు వెడుతుంటే తనకి తెలియకుండానే ఆ కన్నెలను తన కళ్లు పలకరించేవి. ఇది మర్యాద కాదు కొత్త ఊరు-అని మనసు వయసుని కసిరితే, జాలిగా బేలగా మౌనం వహించేవాడు బుద్ధి మంతుడిలా.

ఒక రోజు తను అద్దెకు ఉంటూన్న వారింట్లో భోజనానికి పిలిచారు-హోటలు భోజనంతో మొహం వాచిన సూర్యానికి ఆరోజు ఎంతో ఆనందం అయింది.

భోజనం చేస్తూంటే ఇంటాయన పెళ్లి కాని కూతురు వనజ అప్పుడప్పుడు గోంగూరపచ్చడో, ఆవకాయో, కూరో-లడ్డూలో పట్టుకు వచ్చి వడిస్తూంటే—పదార్థాలకు నోరూ, వనజ అందానికి మనసూ ఊరి కితకితలు పెట్టాయి. కాస్త సంస్కారం అడ్డు వచ్చింది గాని, వనజని పలకరించి, నాకూ పెళ్లి కాలేదు అనాలని లోపల అనుకొని, పైకి నవ్వాలని అనుకొంటూ ఇంటాయన చూస్తూంటే - తననే చూస్తున్నాడేమో నని "గోంగూరపచ్చడి, బాగాఉందండి" అన్నాడు.

ఆయన నవ్వి, "ఆపచ్చడి మా వనజ వేసిందయ్యా బాగుండక ఏంచేస్తుందీ," అంటూ "అమ్మాయ్! ఇంకాస్త పచ్చడి ఆయనకు వడ్డించు. మొహమాట పడుతున్నట్లున్నాడు" అనడం తడవుగా, వనజ నిమ్మకాయంత పచ్చడి సూర్యం విస్తర్లోవడ్డించి 'అంతబాగుందాండి' అంది!

'మీ అంత బాగుంది, అందామనుకొని కారం పచ్చడితో అందమైన అమ్మాయిని పోలిస్తే ఏమనుకొంటుందో' అని, నవ్వి ఊరుకున్నాడు.

*   *   *

ఆ రోజు రాత్రి నిద్రరాని సూర్యానికి పెళ్లి చేసుకొని హాయిగా ఉండాలన్న అభిప్రాయం కలిగింది! ఎవరిని అన్న ప్రశ్న ఎదురైంది- చెరువుకు వచ్చే అమ్మాయిలలో అందమైన దాన్ని అంది మనసు.

'ఒరేయ్ సూర్యం! ఇంతకాలానికి నీకు మంచి ఐడియా కలిగినందుకు అభినందిస్తున్నానురా' అంది వయసులో అవకాశం కోసం దాగున్న కోర్కె!

ఆఫీసులో తనకెదురుగా టైపు చేస్తూన్న నిర్మల తననే చూస్తూన్నట్లు, తన కోసం లవ్‌లెటర్ టైపుచేస్తూన్నట్లు, అలా అలా మనసులోమాటలు వినిపిస్తూ వున్నాయి-

ఏదో పని ఉన్నట్లు లేచాడు.

తిన్నగా నిర్మల టేబులు దగ్గరకు వెళ్లాడు.

నాకు పెళ్లి అవలేదన్నాడు!

ఆమె నవ్వింది!!

నిర్మల గలగలా నవ్వింది!!

సూర్యం— నాపేరు తెలుసుకదా అన్నాడు

మళ్ళీ నవ్వింది!

విరగబడి నవ్వింది!!



అందరూ చూస్తున్నారేమో అని తనూ నవ్వేసి 'మళ్ళీ కలుసుకుంటా', అంటూ రాబోయి, ఓసారి వెనక్కి తిరిగి ఆశగా చూశాడు.

మళ్లీ అలాగే నవ్వింది నిర్మల!

మత్తుగా నవ్వింది నిర్మల!!

సాయంత్రం అలంకరించుకొన్న ఆడదానిలా ఉంది! సూర్యం మనసు ఏదోలా ఉంది!!

అప్రయత్నంగా గదికితాళం వేశాడు! గుమ్మాలు దిగుతుంటే వనజ పొదికట్టున నిలబడి నవ్వింది!

తనూ నవ్వితే?

నవ్వాలను కొన్నాడు సూర్యం!

'బైటకా ఏమిటోయ్?' ఇంటాయన పలకరింపుతో నవ్వుకు మారు ఏడుపు వచ్చింది.

"బోరుగా ఉందండీ గదిలో-అందుకని కాస్తసేపు అలా తిరిగొద్దామని," అంటూ బైటకు నడిచాడు సూర్యం!

అప్పుడే సూర్యుడు పడమటి దిక్కున వాలిపోతూ, ముఖాన్ని జేగుర్లా చేసు కొంటున్నాడు. ఆ నీరెండ పొడలు, చెరువు నీళ్ళు, రావిచెట్ల నీడలు - వీచే గాలి - నీళ్లకోసం బిందెలతో వచ్చిన పడుచుల అందాలు, ఒయ్యారాలు - ఓహ్!- సూర్యాన్ని ఆగమనకుండానే ఆగిపోయాడు.

"ఊరికి కొత్తగా వచ్చిన సూర్యం గారు ఈయనే కాబోలు - అలా వాచి పోయినట్లు చూస్తున్నా డేమిటో— పెళ్లి కాలేదా?" ఆ మాటలు నవ్వుల మధ్య వినిపించి, అమ్మాయిలతో పాటు కను మరుగై పోయాయి.

సూర్యుడు పడమటి దిక్కున మరీ దిగి పోతున్నాడు - అమ్మాయిల మాటలతో సూర్యం మొఖంలో కోపం వచ్చినట్లుగా రంగులు మారి అంతలోనే సర్దుకొని,కాస్త అలా చేలగట్లంట తిరిగి వద్దాం అను కొన్నాడు!

పచ్చని చేలు - ఆ ఊరు ఉన్నదే తోటల మధ్య. పెద్ద చెరువు, పెద్ద గుళ్లు, చేలు, కాలువ - పక్షుల కిలకిలలు పిల్ల కాలువల గలగలలు. పంటచేల సంగీతాలు- పిల్ల గాలుల పలకరింపులు- అలా వెళ్లి వెళ్లి ఓమర్రి చెట్టు క్రింద కూర్చున్నాడు, సూర్యం!

మర్రి నీడలో తను - చుట్టూ అంద మైన ప్రకృతి -.అప్పుడే వెలుగు వెడ దామనీ, వెన్నెల నవ్వుదామని అను కొంటున్న సమయం!

ఈ సమయంలో తన పక్కన ఓ అందాల భామ వుంటే? పెళ్లిఅయి ఉంటే ఈ చేలమధ్యలో పిల్ల కాలువ పిలుపులలో డ్యూయెట్సు పాడు కుంటూంటే - సూర్యం మనసంతా ఒంటరితనం మీద రోత - జంటకై ఆరాటం - నిండిపో యింది!

కొండ మీద మేఘాల పరదాలలో వద్దామా మానదామా అని దోచూచు లాడుతూన్న చందమామ!


మర్రినీడ క్రిందతను!

వనజ! పచ్చనీ పూలచీర తొడిగి పూబంతిలా నవ్వుతూ వస్తూన్నట్టు భ్రమ! తను పొన్నమీద పిల్లనగ్రోవి వాయి స్తూంటే గోపికలు చుట్టూ ఆడుతున్న దృశ్యాలు, చెరువు, పడుచులు, మర్రి నీడలో నీడల్లా ఆలోచనలు!

పోదాం! అనుకొన్నాడు సూర్యం. ఎవరో తనవెంటే వస్తూన్న అలికిడి! ఆగాడు సూర్యం!!

అందమైన నవ్వుల సవ్వడి మనసుకు హాయిగా వినిపించి ఆగిపోయాడు సూర్యం!

తను కలగంటున్నాడా! నిజమా? నిశ్చేష్టుడై నిలబడి పోయిన సూర్యానికి 'రండి - మీకోసమే వెతుక్కుంటూ వచ్చా' అన్న తియ్యని మాట తట్టినట్ల యింది.




తన కోర్కెలు తనని నడిపిస్తున్నాయి. తన ఆశలు పలికిస్తున్నాయి. ఆమె చేయి అందించింది!

అతడు కదిలి నడుస్తున్నాడు!!

మర్రి నీడలో ఓ పక్కగా తను కూర్చుంది! అతనూ కూర్చున్నాడు!

'ఏమిటలా చూస్తున్నారు? మాట్లాడండి'- అంది ఆమె!

వీణ మీటినట్లుగా ఉంది పలకరింపు అతనికి!

"మాట్లాడు, ఎందుకోసం తహ తహలాడావో తెలుసుగా. తనకు తాను వచ్చిన ఆడదాన్ని కాదనకు- నీ ఒంటరితనాన్ని వదిలి హాయిగా ఆనంద లోకాలకు ఎగిరిపో" మనసు అతడ్ని హెచ్చరించింది!

'నేను ఇక్కడ ఉన్నానని మీకు ఎలా తెలుసు?'—

వెన్నెల్లా నవ్వింది ఆమె!

విడిచిన పువ్వులా సూర్యం నవ్వాడు!!

'మీకోసం చూస్తూనే ఉన్నాను! వస్తారనీ, వచ్చి నన్ను కలుసు కుంటారనీ, కలిసి పలకరిస్తారనీ, పలకరింపులతో పులకరింప జేస్తారనీ- పులకరింపులలో పుస్తె కట్టి నన్ను మీదాన్ని చేసుకొంటారనీ నాకు తెలుసు'—

సూర్యంలో ధైర్యం కరిగిపోతూంది!

ఆమెమాటలప్రవాహం అతడ్ని ప్రశ్నల రథంలాతోచి మూగవాడ్ని చేస్తూంది!!

మౌనంగా ఉండి పోయాడు సూర్యం!

'ఏం నేను అందంగాలేనా?' దగ్గరగా జరిగి అడిగింది ఆమె!

'ఉన్నారు మరి'—

'పాట పాడతా వినండి'- అమె పాడుతూంది.

పైరగాలిలో ఆపాట మాధుర్యంలో సూర్యం మైమరచి పోతున్నాడు.

"వనజ - బాగుందనుకొన్నా! ఆ నవ్వులో ఎంతహాయి ఉండేది? కాని ఈ అమ్మయిలో వింత అందంవుంది, నవ్వుతూంటే ముత్యాల జల్లులా వుంది" ఊహలు పరుగులు పెడుతున్నాయి.

'చెరువుకు వెళ్ళే అమ్మాయిలు ఎంతో బాగున్నారనుకొన్నా - ఈ అమ్మాయి ముందు తీసికట్టే'-ఆలోచనా తరంగాలు పరుగులు పెడుతున్నాయి.

"కంఠం ఎంత కమ్మగా ఉంది. ఇలాంటి అందమైన అమ్మాయి, ఇంత తియ్యనికంఠం ఎంతకాలానికి" ఆనందం తన్మయుని చేస్తూంది.

పకపక నవ్వింది!

విరగబడి నవ్వుతూంది!!

వెన్నెలలా ముత్యాల వానలా కిలకిల మని నవ్వుతూనే ఉంది!!!

అప్పటికిగాని సూర్యం మామూలు స్థితిలోకి రాలేదు!

'పాట బాగుందా?' అడిగింది ఆ అమ్మాయి.

'చాలా బాగుంది'- కన్నార్పకుండా ఆ అమ్మాయినే చూస్తున్నాడు. గుండె వేగంగా కొట్టు కొంటూంది. ఏదో పలక రించాలని మనసు ఆరాట పడుతూంది. ఏమన్నా ఏమనుకుంటుందో అని భయం.

'మీ పేరు?' అమ్మాయే అడిగింది!

'సూర్యం' బలంగా చెప్పాడు!

'చంద్రం అనుకొన్నాను' అని నిండుగా కొంటెగా నవ్వింది.

అలామాట్లాడే అమ్మాయంటే మరీ ఇష్టం సూర్యానికి అందుకే నిండుగా నవ్వాడు వోరగా చూశాడు!

'నాకు పెళ్ళి కాలేదు' - అడిగిన ప్రశ్నకు సమాధానంలా చెప్పింది - సమాధానం కోసం ఆశగా చూస్తూంది.

"నాకూ కాలేదు" - అని సూర్యం ఏదో అడగాలని పెదిమలు కదిపాడు. ఏం అడగలేదు అడగలేక పోయాడు.

మర్రినీడలో అక్కడక్కడ నెలవంక కిరణాలు చోటు చేసికొని కొమ్మల రెమ్మల ఆకుల సందుల్లోంచి నేలమీద అక్కడక్కడ ముగ్గులు పెట్టినట్లుగా పడి పెళ్లి పందిరిలో రంగవల్లికలు వేసినట్లుగా ఉంది.

'ఏం! ఏం మాటలులేవా అడగ డానికి' అన్నట్లు ఆఅమ్మాయి గడుసుగా నవ్వింది-

ఆ నవ్వు అతడి హృదయంలో కిత కితలు పెట్టింది ఒళ్లంతా ఏదోలా ఉంది. మనసంతా అదోలా ఉంది


"మీ పేరు?"

"జ్యోత్స్న"

"చాలా బాగుంది! మీలాగే!"

"నిజంగానా!"

"అబద్ధం ఎందుకు చెప్పాలి" అని, జ్యోత్స్నని పరిశీలనగా చూశాడు.




సిగ్గు దొంతరలు ముసురు కొనగా తలవంచుకొని "ఏదో వెతుకుతున్నారు" అంది!

"నేను వెళ్లనా! చాలా పొద్దు పోయింది- ఇంత పొద్దు పోయేవరకూ నన్ను మీపాట, అందం కట్టేశాయి" అంటూ లేచాడు సూర్యం!

కూర్చోమన్నట్లు చేయి పట్టుకుంది. జాలి చూపులు చూస్తూంది.

కూర్చున్నాడు సూర్యం!

కళ్లల్లో కళ్ళు కలిపాడు.

గుండెతో గుండెను మాట్లాడించాలను కొంటూంది జ్యోత్స్న!

మనసుతో వయసుకి స్నేహం కట్టాలని అనుకొంది జ్యోత్స్న!!

'నామీద మీకు మనసులేదా సూర్యం?' సూటిగా అడిగింది!

ఆ ప్రశ్నలో ఎంత ఆశ, మరెంత అనురాగ ం?

'నీకు?' సూర్యం అడిగాడు.

"నేను నీకోసం పుట్టాను! నీకోసం వేచిఉన్నాను. ఈ వెన్నెల - ఎంత హాయిగా ఉందో చూడు. ఈ గాలి ఎంత హాయిగా ఉందో చూడు." జ్యోత్స్న అతని ఒడిలోకి తల ఆన్చి - 'సూర్యం' అంది!

'ఊఁ!' అంటూ జ్యోత్స్న తలని నిమురుతున్నాడు.

వెన్నెల బాగా కురుస్తూంది!

పైరుగాలి చల్లగా పిలుస్తూంది!

రకరకాల పూల పరిమళాలు మత్తె క్కిస్తున్నాయి!

సూర్యం జ్యోత్స్నలో లీనమై ఏకమై ఆనంద లోకాలలో తేలిపోతున్నాడు!

జ్యోత్స్న తన కలలని పండించు కొని స్వర్గంలోకి పరుగులు పెడుతూంది!

అది రెండు హృదయాలు పెనవేసు

కొన్న వేళ! జంటలు మనసులు కలుపు కొన్న వేళ - మర్రి నీడలో వెన్నెల ఆనందం నృత్యం చేస్తున్న వేళ-

జ్యోత్స్న వెచ్చని కౌగిలిలో సూర్యం మంచులా కరిగి పోయిన వేళ!

మర్రిచెట్టు పైన పక్షుల జంటలు రెక్కలు ఆడించి ఒళ్లు విరుచుకున్న వేళ—

"నువ్వు ఎంత అందంగా, కమ్మగా, ఉన్నావు జ్యోత్స్నా" అంటూ జారిన పమిటని కొంటెగా చూశాడు సూర్యం! మత్తెక్కిన కళ్లతో మత్తెక్కిస్తూంది జ్యోత్స్న.

"మళ్ళీ ఎప్పుడు కలుసుకుందాం సూర్యం- నీకోసం ప్రతిరోజూ ఇక్కడే ఈ సమయంలో ఇలాగే ఎదురు చూస్తుంటాను. నన్ను - మరిచి పోవుకదూ? నన్ను విడిచి పోవుకదూ?" అతని జుట్టులో వేళ్ళుపెట్టి దువ్వుతూ అడిగింది.

"మరిచిపోను జ్యోత్స్నా! నిన్ను ఒదిలి పోలేను- నాకు దొరికిన అదృష్టాన్ని జార విడుచుకోను- నాకు నువ్వే కావాలి. నాకు జంట కావాలి. నాకు జ్యోత్స్న కావాలి" అంటూ బుగ్గల మీద చేతులతో రాస్తూ లేచాడు సూర్యం!

"తిరిగి నువ్వు వచ్చేవరకూ ఈ మధురస్మృతిని గుండెలో దాచుకొని - నీ రూపాన్ని కళ్లల్లో నిలుపుకుని ఎదురు చూస్తుంటాను సూర్యం"

సూర్యం ప్రేమగా చూస్తూ వదల లేక వదిలి ఆనందపు హుషారులో వెన్నెలలో నీటి కెరటాలలా ఎగురు తూన్న పచ్చని చేలను దాటుకుని గదికి వెళ్లాడు.

జ్యోత్స్న మెళ్లో పుస్తె కట్టేదాకా ఈ విషయం ఎవరితోనూ చెప్ప కూడదను కొన్నాడు.

ఈ లోకం మంచిదికాదు - ఈర్ష్య ఎక్కువ. జ్యోత్స్నవంటి ఊర్వశి నాకు దక్కిందని, నన్ను వరించిందని, నాకు అర్ధాంగి కాబోతుందని చెబితే! అడ్డు పడతారు- తనలో తాను నిర్ణయాలు చేసుకొన్నాడు.


పక్కమీద వాలాడు. జ్యోత్స్న పక్కన ఉన్న ఆ క్షణంలో ఎంత హాయీ, ఆనందం ఉందీ అనుకొన్నాడు!

ఎప్పుడు తెల్లారుతుందా? సాయంత్రం ఎప్పుడు అవుతుందా, జ్యోత్స్న ఒడిలో వాలి పోదామా అనుకొంటూ తియ్యని కలలపడవకు తెరచాప ఎత్తి ఆనంద సాగరంలో పయనిస్తున్నాడు.

* * *

'నమస్కారం సూర్యం గారూ!' అంటూ ఉదయం వచ్చారు ఆ ఊరిలోని మోతుబరి రైతు భద్రంగారు!

భద్రం పక్కన తను ఉంటూన్న ఇంటి యజమాని కామేశంగారు, పక్కన వనజ కూడా ఉన్నారు-




"న మ స్కా ర ం" అన్నాడు సూర్యం!- ఉదయాన్నే ఎందుకువచ్చారా అను కొంటూ!! అడిగితే ఏం బాగుం టుంది అని ఊరుకున్నాడు.

అటు భద్రంగారిని, ఇటు తండ్రి కామేశంగార్ని తప్పించుకొని వనజ సూర్యాన్ని చూస్తూ ఓ నవ్వు మామూలు ధోరణిలో విసిరింది.

వనజ నవ్వుల్లో ముత్యాలు, పగ డాలు వెతుక్కోడం సూర్యానికి ఇంత క్రితం అలవాటు! జ్యోత్స్నని కలుసు కున్న సూర్యానికి ఇప్పుడు వ న జ నవ్వులో వెన్నెల లేదు. ముత్యాలు, పగడాలూ లేవు - వెకిలిగా వెగటుగా అనిపించింది. ము ఖ ం ము డు చు కొన్నాడు—అది పెద్దల ముందు తెలియ కూడదని దాచుకొన్నాడు!!

'నుంచునే ఉన్నారు- గదిలోకి రండి' భద్రంగారిని ఆహ్వానించాడు సూర్యం!

"చూడండి సూర్యంగారూ! భద్రం గారని ఈ ఊళ్లో పెద్ద భూస్వాములు- మంచి కుటుంబీకులు - వారి ఆనందం అంతా తనతోనే తీసుకు పోయింది- రెండు సంవత్సరాల నాడు సరిగా రేపటి రోజున అన్నమాట - భద్రంగారి అమ్మాయి తను ప్రేమించిన అబ్బాయిని పెళ్లికి వద్దన్నారని, వీరి చేలవద్ద ఓ పెద్ద చెట్టుకి ఉరి పోసుకు చని పోయింది- ఆ రోజునుంచీ ఆ అమ్మా యికి ప్రతి సంవత్సరం ఆ చెట్టు నీడలో ఆ ప్రదేశంలోనే సంతర్పణ చేసి, ఆ అమ్మాయిని తలుచు కొంటుంటారు- అమ్మాయి కోర్కెలు తీరక, బలవం తంగా చచ్చిపోయి దయ్యంగా మారి ఆ

చెట్టునే ఆశ్రయించుకొని ఒంటరిగా వచ్చే యువకులను పిలిచి వారితో తన కోర్కెలని తీర్చుకొని సంతృప్తి పడు తుందంటారు. కడుపున పుట్టినందుకు యువతిగా చనిపోయి నందుకు చని పోయిన తిథి రోజున అదే ప్రదేశంలో సంతర్పణ చేస్తుంటారు- మీరు కొత్తగా మాఊరికి ఉద్యోగిగావచ్చారని మిమ్మల్నీ రేపు భోజనానికి ఆహ్వానించాలని వచ్చారు" కథంతా చెప్పారు కామేశం గారు!

కన్నీరు తుడుచు కున్నారు భద్రం గారు- అలాగే నుంచుని పోయారు.

సూర్యం కొట్టిన రాయిలా కన్నార్ప కుండా నిలబడిచూస్తూ ఉండి పోయాడు. తన ఒళ్లంతా చెమటలు వచ్చాయి. నరా లన్నీ పీకుతూన్నట్లు అయిపోతూ న్నాయి——

"కామేశంగారు చెప్పేచేలు ఎక్కడ, చెట్టు ఎక్కడ" తనని మనసు ప్రశ్నిం చింది. ఏదో అడగాలని నోరువిప్పాడు. పెదిమలు భయంగా ఒణికాయి-!

"ఆ... అమ్మా...యి పేరు?" బల వంతంగా అడిగాడు సూర్యం!

వస్తూన్న దుఃఖాన్ని ఆపుకొంటూ 'జ్యోత్స్న బాబూ' అన్నారు భద్రం గారు!

సూర్యం ఒళ్లంతా మంచులా, గడ్డ కట్టుకు పోతూంది-

'చెరువవతల మర్రి చెట్టుదగ్గరాండి?' బలవంతంగా శ్రమపడి అడిగాడు సూర్యం!

"అవును బాబూ! ఆ పచ్చని చేలు నావే- ఆ అబ్బాయీ, జ్యోత్స్న ఆడి పాడిన ప్రదేశం అదే-అదే అక్కడ ఉన్న మర్రి చెట్టు నీడలలోనే వాళ్ళు కలుసుకొనే వారట - ఆ మర్రినీడే నాజ్యోత్స్నకు నీడ అయిపోయింది బాబూ"అని, 'వస్తా, తప్పకరండి' అని వెళ్లిపోయారు భద్రంగారు.

"మర్రి నీడ!!!" అని గట్టిగా అరచి చెట్టులా నిలువునా కూలిపోయాడు సూర్యం!

